రోడ్డు భద్రతపై స్పెషల్‌ డ్రైవ్‌

- ప్రమాణాలు పాటించని వాహనాల సీజ్‌
- కాచిగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ శ్రీనివాస్‌


కళాశాల బస్సును సీజ్‌ చేస్తున్న పోలీసులు, రవాణాశాఖ అధికారులు

కాచిగూడ: విద్యాసంస్థల బస్సుల నిర్వాహకులు సరైన భద్రతా ప్రమాణాలు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని కాచిగూడ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎ.శ్రీనివాస్‌ అన్నారు. శుక్రవారం బర్కత్‌పుర చౌరస్తాలో కాచిగూడ ట్రాఫిక్‌ పోలీసులు, ఆర్టీఏ అధికారులు స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ మార్గంలో వెళ్తున్న ప్రైవేట్‌ పాఠశాలలు, కళాశాల బస్సులు, స్కూల్‌ పిల్లలను తీసుకుని వెళ్తున్న ఆటోలను ఆపి తనిఖీ చేశారు. వాహనాల ఫిట్‌నెస్‌, డ్రైవింగ్‌ లైసెన్స్‌, ఫైర్‌ సేఫ్టీ, తదితర వాటిపై ఆరా తీశారు. రాకపోకల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవగాహన కల్పించారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులు, ఆటోల్లో తీసుకెళ్లకూడదని సూచించారు. ఓ ఇంజినీరింగ్‌ కాలేజీకి చెందిన బస్సు, స్కూల్‌ పిల్లలను తీసుకెళ్తున్న ఆటోను ఆర్టీఏ అధికారులు సీజ్‌ చేశారు. లైసెన్స్‌ లేకుండా వాహనాలు నడపొద్దని, మైనర్ల చేతికి వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. స్కూల్‌ ఆటోల్లో 6 మంది పిల్లలకంటే ఎక్కువ మంది పిల్లలను ఎక్కించుకోకుండా తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఏఎంవీఐ రజనీ (మలక్‌పేట), హెడ్‌ కానిస్టేబుల్‌ జాకీర్‌హుస్సేన్‌, కానిస్టేబుల్‌ విజయుడు, భిక్షం, బాలరాజు, రాంరెడ్డి, జమాలుద్దీన్‌, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి


సామాజికవేత్త కందూరి కృష్ణను సన్మానించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముషీరాబాద్‌ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాకర్స్‌ క్లబ్‌ ఆఫ్‌ సెంట్రల్‌ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్‌ క్యాంపును నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న కందూరి కృష్ణ, మాణిక్‌లాల్‌ అగర్వాల్‌ను ఘనంగా సత్కరించారు. సుందరయ్య పార్కులో ఉన్న భవనానికి మరమ్మతులు చేయించినందుకు కృతజ్ఞతగా ఆయనను సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని నిరంతరం సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత గోపాలకృష్ణ గోకలే మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. నిరంతరం ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఉచితంగా బీపీ, షుగర్‌, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. వాకర్స్‌ క్లబ్‌ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్‌.వివేక్‌, వెంకటస్వామిగౌడ్‌, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు బబ్లూ, ఆర్‌.దామోదర్‌రెడ్డి, వాకర్స్‌ ఇంటర్నేషనల్‌ ప్రతినిధి ఎస్‌.మురళీకృష్ణ, రత్నాకర్‌రెడ్డి, బంగ్లరాజ్‌ తదితరులున్నారు.

పేదలకు కుట్టు మిషన్ల పంపిణీ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాతా వాకర్స్‌ క్లబ్‌ నల్లకుంట ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త హిమబిందు సహకారంతో ముగ్గురు పేద మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాతావాకర్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు డాక్టర్‌ వై.మురళీధరుడు మాట్లాడుతూ.. పేద ప్రజలకు సాయం చేసేందుకు తమ క్లబ్‌ ద్వారా అనేక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, అన్నదానం, చలివేంద్రంతో పాటు పేద విద్యార్థులకు నోట్‌బుక్స్‌ తదితర సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. క్లబ్‌ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్‌, కోశాధికారి కోనేరు జైహింద్‌, ఉపాధ్యక్షులు సీ.హెచ్‌. విశ్వనాథశాస్త్రి, డాక్టర్‌ శ్రీధర్‌, సురేష్‌బాబు, వెంకట్‌, కేశవరావు దేశ్‌పాండే, బొమ్మిడి శ్రవణ్‌కుమార్‌, లోకేష్‌, శ్రీనివాస్‌ తదితరులున్నారు.


కుట్టు మిషన్లను పంపిణీ చేస్తున్న మాతా వాకర్స్‌ క్లబ్‌ ప్రతినిధులు

ప్రజా సమస్యలపై కార్పొరేటర్లు దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ కె.లక్ష్మణ్‌

కాచిగూడ: ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ కార్పొరేటర్లు నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ.. కృషి చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ సూచించారు. శుక్రవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన బీజేపీ కార్పొరేటర్ల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భవిష్యత్తులో రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతానికి కార్పొరేటర్లు కృషి చేయాలన్నారు. హైదరాబాద్‌ సెంట్రల్‌ జిల్లా అధ్యక్షుడు డాక్టర్‌ ఎన్‌.గౌతంరావు మాట్లాడుతూ.. రాబోయే గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ ఎన్నికల్లో బీజేపీ మేయర్‌ పీఠాన్ని కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ బీజేపీ ఫ్లోర్‌ లీడర్‌ శంకర్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలపై అవగాహన


అప్సాటెక్‌ మహేంద్ర ఫౌండేషన్‌ ఉద్యోగులతో విద్యార్థులు

ముషీరాబాద్‌: టెక్‌ మహేంద్ర ఫౌండేషన్‌, అప్సా స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో టెక్‌ మహేంద్ర స్మార్ట్‌ ఉపాధి శిక్షణ కేంద్రం గురించి శుక్రవారం రాంనగర్‌ మీసేవ వద్ద నిరుద్యోగులకు అవగాహన, దరఖాస్తుల స్వీకరణ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తమ వద్ద ఉన్న ఉచిత ఉపాధి నైపుణ్య కోర్సుల గురించి నిరుద్యోగులకు వివరించి ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీయువకుల పేర్లు నమోదుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్సా ప్రాజెక్టు మేనేజర్‌ ప్రవీణ్‌ హజారే మాట్లాడుతూ.. ట్యాలీప్రైమ్‌ అడ్వాన్స్‌కం ఎక్సెల్‌, కమ్యూనికేటివ్‌ ఇంగ్లిష్‌, టైపింగ్‌, ఇంటర్నెట్‌ కాన్సెప్ట్స్‌, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణనిచ్చి 100 శాతం ఉద్యోగాలు కల్పిస్తామని చదువు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులు, ఆర్థిక కారణాలతో చదువును మధ్యలోనే ఆపేసి, ఖచ్చితంగా ఉద్యోగం చేస్తామనే వారికి మంచి అవకాశమని ఆయన పేర్కొన్నారు. వివరాలకు 9154990135/33. బీఆర్‌ఎస్‌ నాయకులు నేత శ్రీనివాస్‌, మాధవ్‌, టక్కర్‌ శ్రీను, లూథర్‌ విజయ్‌, హరిప్రకాష్‌, మౌలా తదితరులున్నారు.

వ్యవసాయ కార్మికులకు న్యాయం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వ్యవసాయ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి డిమాండ్‌ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. మహిళలకు ప్రతినెల రూ.2500, గ్యాస్‌ సిలిండర్‌ రూ.500, కొత్త రేషన్‌ కార్డులు, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ తదితర హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. కౌలు రైతులకు ఎకరాకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇవ్వాలని కోరారు. ఇళ్లులేని పేదలకు ఇంటి స్థలంతో పాటు రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షలు ఇస్తామని వాగ్దానం చేసిందన్నారు. ఇప్పటి వరకు వాటి గురించి చర్చించకపోవడం బాధాకరమన్నారు. ఉపాధి హామీలో 150 రోజుల పని దినాలు కల్పించాలని డిమాండ్‌ చేశారు. పుట్టిన ప్రతి ఆడ శిశువుకు ఆర్థికసాయం కోసం బంగారు తల్లి పథకాన్ని అమలు చేయాలని కోరారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌.వెంకటరాములు, ఉపాధ్యక్షుడు ప్రసాద్‌, నారీ ఐలయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కందూకూరి జగన్‌ తదితరులు పాల్గొన్నారు.

నివారణ మార్గాలే రక్షణ చర్యలు

- మలేరియా, డెంగీ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన
- అవగాహన శిబిరంలో చీఫ్‌ ఎంటమాలజిస్ట్‌ డా.రాంబాబు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చీఫ్‌ ఎంటమాలజిస్ట్‌ డాక్టర్‌ రాంబాబు

కాచిగూడ : దోమల రహిత నగరం కోసం అందరం కలిసి పోరాడుదామని జీహెచ్‌ఎంసీ చీఫ్‌ ఎంటమాలజిస్టు డాక్టర్‌ రాంబాబు పిలుపునిచ్చారు. గ్రేటర్‌ హైదరాబాద్‌ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నారాయణగూడలోని మాడపాటి హనుమంతరావు బాలికల హైస్కూల్‌లో దోమల నివారణపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుటుంబ సమేతంగా మన ఇళ్లు, పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల నుంచి రక్షణ పొందాలని సూచించారు. దోమలను నివారించి మలేరియా, డెంగీ, చికెన్‌ గున్యా తదితర వ్యాధుల నుంచి మనల్ని మనమే కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దోమల నియంత్రణకు జాగ్రత్తలు..

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- ఇంటి లోపల, పైన ఓవర్‌హెడ్‌ వాటర్‌ ట్యాంకు మూతలు బిగించి ఉంచుకోవాలి. రబ్బరు టైర్లు, పాత వస్తువులు, ప్లాస్టిక్‌, పాలిథిన్‌ వస్తువుల్లో నీటిని నిల్వ లేకుండా చూడాలి. వీటిని దోమలకు ఆవాసయోగం కాకుండా తొలగించాలి.
- పిచ్చి మొక్కలు ఎక్కువ ఉంటే దోమల సంతాన ఉత్పత్తికి కేంద్రాలుగా మారతాయి. వీటికి బదులు ఇళ్లలో తులసి, పూదీనా, సిట్రోనెల్లాగ్రాస్‌, లెమన్‌గ్రాస్‌ వంటి మొక్కలను కుండీల్లో పెంచుకోవడం వల్ల దోమలను చాలా వరకు నియంత్రించవచ్చు.
- ఇంటి పరిసరాలల్లో మురికి నీటిని నిల్వలేకుండా చూసుకోవాలి. ఇంటి నుంచి బయటకు వెళ్లే నీరు పూర్తిస్థాయిలో డ్రైనేజీ, ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేయాలి.
- నీటి నిల్వకు దారితీసే చిన్నచిన్న పూడికలు, గుంతలను మూసివేయాలి.

దోమల నివారణపై అవగాహన..

దోమల నివారణపై జరిగిన అవగాహన శిబిరంలో విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పెంచుకున్నారు. జీహెచ్‌ఎంసీ చీఫ్‌ ఎంటమాలజిస్టు డాక్టర్‌ రాంబాబు, స్కూల్‌ ప్రిన్సిపాల్‌ విజిత, ఈఎఫ్‌ఏ నరేందర్‌రెడ్డి, మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ మనోజ్‌రెడ్డి, డీపీఓ శ్రీనివాస్‌, సిస్టర్‌ రమా, ఆశావర్కర్లు, ఎంటమాలజీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


నీటిలో దోమల వృద్ధిపై విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

నివారణే ముఖ్యం..



మామూలు డెంగీ జ్వరం పారాసిటమాల్‌ మాత్రలతోనే తగ్గుతుంది. వాంతులు లేకపోతే ఓఆర్‌ఎస్‌ ద్రావణం తాగించాలి. డెంగీలో జ్వరం తగ్గుతున్నప్పుడే రక్తపోటు, ప్లేట్‌లెట్లు పడిపోతుంటాయి. కాబట్టి జ్వరం తగ్గిందని నిర్లక్ష్యం చేయొద్దు. దోమలు కుట్టకుండా చూసుకుంటే డెంగీని పూర్తిగా నివారించుకోవచ్చు. పొడుగు చేతుల చొక్కాలు, ప్యాంట్లు ధరించాలి. దోమలు కుట్టకుండా కాళ్లు, చేతులకు క్రీములు రాసుకోవాలి, డెంగీ వచ్చిన వారు దోమతెరలోనే ఉండాలి.

– డాక్టర్‌ మనోజ్‌ రెడ్డి, మెడికల్‌ ఆఫీసర్‌

విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: దోమల నివారణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బాగ్‌ అంబర్‌పేట డివిజన్‌ కార్పొరేటర్‌ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలలో జీహెచ్‌ఎంసీ ఎంటామాలజీ విభాగం అధికారులతో కలిసి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ఆవాసాల పట్ల ఇంటి పరిసరాల్లో దోమల ఆవాసాలను నిర్మూలించాలని ఆమె సూచించారు. వర్షాకాలంలో దోమలు ప్రబలే అవకాశం ఉందని వాటిని నిర్మూలిస్తే వ్యాధులు దరిచేరవన్నారు. ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు సరికావు

ముషీరాబాద్‌: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని టీజీఎస్‌పీఎస్సీ ముట్టడికి పిలుపునిచ్చిన నిరుద్యోగులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేయడం సరికాదని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌, ప్రధాన కార్యదర్శి ఎస్వీ శ్రీకాంత్‌లు పేర్కొన్నారు. నిరుద్యోగ అభ్యర్థుల తలలు పలగకొట్టడం, అక్రమ అరెస్టులు, భారీకేడ్లు, ముళ్ల కంచెలు ఏర్పాటు చేసి నిర్బంధించడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పీడీఎస్‌యూ, పీవైఎల్‌ నాయకులను అర్ధరాత్రి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్లలో నిర్బంధించారన్నారు. ఈ అప్రజాస్వామిక, నియంతృత్వ చర్యలను ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ), ప్రగతిశీల యువజన సంఘం(పీవైఎల్‌) తీవ్రంగా ఖండిస్తుందన్నారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించి నిరుద్యోగ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ఉద్యోగాల కేలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్‌ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు. ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరి సాగర్‌, ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

బాలిక అదృశ్యం

చిక్కడపల్లి : ఓ బాలిక ఇంటి నుంచి అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. దోమలగూడ సీఐ డి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రీకాంత్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కవాడిగూడ డివిజన్‌లోని మోతీలాల్‌ నెహ్రూనగర్‌లో నివసించే ఆకేల్‌ కామత్‌, ప్రమీల దేవీలకు ఐదుగురు కుమార్తెలు సంతానం. కాగా మూడో కుమార్తె సుమంజలి 10వ తరగతి ఫెయిల్‌ కావటంతో ఇంట్లోనే ఉంటోంది. ఈనెల 3న కామత్‌, ప్రమీల వారివారి పనుల మీద బయటకు వెళ్లగా.. సుమంజలి ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలుచోట్ల ఆచూకీ కోసం వెతికినా లభించకపోవడంతో శుక్రవారం దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వినతిపత్రం అందజేత

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా త్వరలో చేపట్టబోయే సామాజిక ఆర్థిక కులగణనకు కార్యచరణ ప్రణాళికను త్వరితగతిన పూర్తిచేసి ప్రభుత్వానికి అందజేయాలని జాతీయ బీసీదళ్‌ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి బీసీ కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ వకుళాభరణం కృష్ణమోహన్‌రావును జాతీయ బీసీదళ్‌ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం అందజేశారు.

‘హామీల అమలులో కాంగ్రెస్‌ విఫలం’


ఎంపీ డాక్టర్‌ కె.లక్ష్మణ్‌తో బీజేపీ నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీజేపీ రాజ్యసభ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్‌ కె.లక్ష్మణ్‌ విమర్శించారు. శుక్రవారం చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ ప్రభుత్వం మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని ఎద్దేవ చేశారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను గత పదేళ్లల్లో అమలు చేసిందని, ప్రస్తుతం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తుందని తెలిపారు. హామీలను అమలు చేయకపోతే భవిష్యత్తులో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పార్థసారధి, బీజేవైఎం మాజీ అధ్యక్షులు గుండగోని భరత్‌గౌడ్‌, జైపాల్‌రెడ్డి, అరుణ్‌కుమార్‌, నవీన్‌ముదిరాజ్‌, జ్యోతి, హర్ష, నర్సింహ్మరాజు, భాగ్యరాజ్‌, వేణు, రవి, రఘు, పాలమూరు శ్రీను తదితరులున్నారు.

అన్నదానం

చిక్కడపల్లి: ప్రతి ఒక్కరూ సేవాగుణాన్ని అలవర్చుకోవాలని చిక్కడపల్లి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సింగారపు రమేశ్‌గుప్తా అన్నారు. శుక్రవారం వివేక్‌నగర్‌ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో అన్నదానం చేశారు. నరసింహారావు, వేంకటసుబ్బయ్య, శ్రీనివాస్‌, సంఘం కార్యదర్శి లక్ష్మణ్‌, ప్రాజెక్ట్‌ చైర్మన్‌ తొడుపునూరి రవి, నాయకులు అమర బాలకుమార్‌, శ్రీనివాస్‌, పల్లెర్ల రమేష్‌, సింగారపు శంకర్‌, రాజూరి బాలచందర్‌, చోల్లేటి శ్రీనాథ్‌, మామిండ్ల సురేందర్‌ పాల్గొన్నారు.

ఆక్రమణలతో ఫుట్‌పాత్‌లు ఇలా..



నారాయణగూడలో వ్యాపారస్తులు..



వెళ్లేందుకు దారేది ?

అంబర్‌పేట జీహెచ్‌ఎంసీ సర్కిల్‌–16 పరిధిలో ఫుట్‌పాత్‌ ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం నాణ్యత ప్రమాణాలతో నిర్మించిన ఫుట్‌పాత్‌లపై ఆక్రమణదారులు వ్యాపారం సాగిస్తుండటంతో ఆధునీకరణ లక్ష్యం నెరవేరడంలేదు. ప్రజాధనంతో నిర్మించిన ఫుట్‌పాత్‌లు కొందరి కోసమే అన్నట్లుగా ఉన్నాయని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– అంబర్‌పేట

ఒవైసీని కలిసిన స్థానిక నేతలు


హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీతో ఎంఐఎం నేతలు

ముషీరాబాద్‌: బక్రీద్‌ పర్వదినాన్ని పురస్కరించుకుని భోలక్‌పూర్‌కు చెందిన పలువురు ఎంఐఎం పార్టీ నేతలు శుక్రవారం ఏఐఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్‌ ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. ఒవైసీ ఐదోసారి ఎంపీగా గెలిచి చరిత్ర సృష్టించారని, పేదల సంక్షేమం ఎంఐఎంతోనే సాధ్యమని పేర్కొన్నారు. నేతలు మహ్మద్‌ తాజాముయినుద్దీన్‌, మహ్మద్‌ దావుద్‌ అలీ, అల్లా కరీం, మహ్మద్‌ అన్వర్‌హుస్సేన్‌, మహ్మద్‌ షాహనవాజ్‌ అలీ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం


విద్యాశాఖ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ట్రస్మానేతలు

కవాడిగూడ: రాష్ట్రంలోని స్కూళ్ల సమస్యలపై త్వరలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించేందుకు కృషిచేస్తానని రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్‌ ఈ.వీ. నర్సింహారెడ్డి హామీ ఇచ్చినట్లు ‘తెలంగాణ రికగ్నైజ్‌ స్కూల్స్‌ మేనేజ్‌మెంట్‌ అసోసియేషన్‌’ (ట్రస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎన్‌. రెడ్డి, ఎగ్జిక్యూటివ్‌ జనరల్‌ రామచంద్రారెడ్డి, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.అనిల్‌కుమార్‌, రాఘవ పేర్కొన్నారు. విద్యాశాఖ డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఈ.వీ. నర్సింహారెడ్డిని శుక్రవారం ట్రస్మా నేతలు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు కె. రామేశ్వర్‌రెడ్డి, హైదరాబాద్‌ నాయకులు జయరాం ప్రసాద్‌, మేడ్చల్‌ నాయకులు ఆంజనేయులు, కో– ఆర్డినేటర్‌ శేఖర్‌చారి తదితరులున్నారు.

కౌలు రైతులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి


రైతు స్వరాజ్య వేదిక సమావేశంలో మాట్లాడుతున్న విస్సా కిరణ్‌

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ష్ట్రంలో కౌలు రైతులను గుర్తించి సంక్షేమ పథకాలను అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్‌ విస్సా కిరణ్‌ అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రైతు స్వరాజ్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ..

2011 భూఆధికృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతులకు సబ్సిడీతో పాటు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వ్యవసాయం చేయని భూములకు రైతుబంధు ఇవ్వడం సరికాదన్నారు. పదెకరాల భూమి ఉన్న రైతులకు రైతు బంధు ఇవ్వాలని సూచించారు. రైతుల ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని, తమ పంటలభీమా పథకాన్ని అమలు చేయాలని కోరారు. డీబీఎఫ్‌ జాతీయ కన్వీనర్‌ శంకర్‌ మాట్లాడుతూ.. కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ పథకాలు మొత్తం రద్దుచేసి రైతుబంధు పథకాన్ని మాత్రమే అమలు చేశారని విమర్శించారు. రైతులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్‌ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. రైతు భరోసా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని సూచించారు. 136 మంది రైతుల ఆత్మహత్యలు చేసుకున్నా..ప్రభుత్వం స్పందించకపోవడం విచాకరమన్నారు. ప్రజల అభిప్రాయం పేరుతో రైతుభరోసా పథకాన్ని కాలయాపన చేయడం సరికాదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వరంగల్‌ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్‌ కన్నెగంటి రవి, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్‌ సంధ్య, వివిధ సంఘాల నేతలు అన్వేష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కొండల్‌, వెంకటేష్‌ తదితరులు పాల్గొని మాట్లాడారు.

మరమ్మతు పనుల పరిశీలన

చిక్కడపల్లి : డివిజన్‌లో అధ్వానంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ సికింద్రాబాద్‌ పార్లమెంట్‌ సంయుక్త కన్వీనర్‌ వినయ్‌కుమార్‌ జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. శుక్రవారం డివిజన్‌లోని కెనరాబ్యాంక్‌, తదితర ప్రాంతాల్లో గంతలమయంగా మారిన రోడ్లకు ప్యాచ్‌వర్క్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్పొరేటర్‌ పావని చొరవతో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేదుకు కృషి చేస్తానన్నారు. వర్షాకాలం దృష్ట్యా అధికారులు రోడ్లకు గుంతలు పడిన ప్రాంతాల్లో సత్వరమే మరమ్మతులు చేపట్టాలన్నారు. జీహెచ్‌ఎంసీ ఏఈ అబ్దుల్‌సలామ్‌, నేతలు ఉమేష్‌, సాయికుమార్‌, లక్ష్మణ్‌యాదవ్‌, గణేష్‌, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాలాలో పడిన వ్యక్తిని రక్షించిన పోలీసులు

కాచిగూడ: ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నాలాలో పడిపోవడంతో ఇద్దరు పోలీస్‌ కానిస్టేబుళ్లు అతడి ప్రాణాలు కాపాడారు. ఈ ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్‌ పరిధి కృష్ణానగర్‌, శ్యామన్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట చెన్నారెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్‌ సాదిక్‌ (50) కూలి పనిచేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. అయనకు భార్య ఓ కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం 11:30 గంటల సమయంలో కూలి పనికోసం చాదర్‌ఘాట్‌ వైపు వెళ్తుండగా శ్యామ్‌నగర్‌ నాలా వద్ద బహిర్భుమికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారీ నాలాలో పడిపోయాడు. సమీపంలో ఉన్న బస్తీ వాసులు కేకలు వేశాడు. అదే సమయంలో పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న కాచిగూడ పోలీస్‌ కానిస్టేబుళ్లు ప్రదీప్‌, సిద్దయ్యలు హుటాహుటిన నాలా వద్దకు పరుగెత్తి బురదనీటిలోకి దిగి సయ్యద్‌ సాదిక్‌ను కాపాడారు. ప్రాణాలతో కాపాడినందుకు కాచిగూడ ఏసీపీ రఘుతో పాటు ఎస్సైలు వారిని అభినందించారు.